క్లుప్తంగా

కుట్టుమిషన్ కేంద్రాల ఏర్పాటు



ఐటీడీఏ భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఇల్లెందురూరల్: పొదుపు సంఘాల మహిళలకు ఆర్థిక చేయూతనందించే లక్ష్యంతో ప్రభుత్వం కల్పించిన యూనిఫాం స్టిచ్చింగ్ నిర్వహణ కేంద్రాలకు శాశ్వత, తాత్కాలిక పద్ధతిపై వసతి సౌకర్యాలను సమకూర్చారు. ఎంపీడీవో ధన్‌సింగ్, సెర్ప్ ఏపీఎం దుర్గారావు ఆదివారం మండలంలోని పలు ఖాళీ భవనాలను పరిశీలించారు. ఇందులో భాగంగా వైటీసీ భవనం, ఐటీడీఏ కాంప్లెక్స్, సీఎస్సీ బస్తీ కమ్యూనిటీ హాల్‌లను శాశ్వత కేంద్రాలుగా కొమరారం, మాణిక్యారం, రాఘబోయినగూడెం, నెహ్రూనగర్ గ్రామాలలో తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆయా చోట్ల కుట్టు పనులు చేసేందుకు అవసరమైన మిషన్లను స్త్రీనిధి, బ్యాంకు లింకేజీల నుంచి రుణంగా ఇప్పిస్తామని చెప్పారు. విద్యార్థుల యూనిఫాంతోపాటు శాశ్వతంగా ఆదాయం సమకూరేలా పొదుపు సంఘాలకు ప్రభుత్వం సహకరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి రజినీకాంత్, ఓబీ టీం లీడర్ కళావతి, వీఓఏ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోఆర్డినేటర్‌గా సీతారాములు



కొత్తగూడెంరూరల్: కాంగ్రెస్ పార్టీ ఖమ్మం నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల కమిటీ కోఆర్డినేటర్‌గా టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములును నియమించారు. ఈ మేరకు ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ కన్వీనర్ కపిలవాయి దిలీప్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్థిక సాయం



వెంకన్నకు నగదు అందజేస్తున్న డేవిడ్

పాల్వంచరూరల్: దంతలబోరు గ్రామంలో ఈనెల 3న అకాల వర్షం, గాలికి నిరుపేదలైన వెంకన్న, చిన్నారి ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. బాధిత కుటుంబాలకు కల్వరి ప్రేమ మందిరం పాస్టర్ కె.డేవిడ్ ఆదివారం రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు.

సీఎం గారూ.. అవినీతిపై విచారణ ఎప్పుడు?



మాట్లాడుతున్న కామేష్

సింగరేణి(కొత్తగూడెం)/కొత్తగూడెంఅర్బన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సింగరేణి అవినీతిపై విచారణ ఎప్పుడని, సింగరేణి మాజీ సీఎండీ అవినీతి లీలలపై స్పందించిన మీరు అరెస్ట్ ఖాయమని ప్రకటించారు. ఆ విషయం ఏమైందని బీఎస్పీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి, బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి యెర్రా కామేష్ ప్రశ్నించారు. ఆదివారం కొత్తగూడెంలోని బీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారాన్ని అడ్డం పెట్టుకొని అప్పటి సింగరేణి సీఎండీ శ్రీధర్ చేసిన అవినీతి అక్రమాలను తాము అధికారంలోకి వచ్చిన వెంటనే విచారణ చేసి బొక్కలో వేస్తామని అప్పట్లో ప్రకటించారు.. ముఖ్యమంత్రి అయిన తరువాత ఆ విషయాన్ని ఎందుకు విస్మరించారన్నారు. 2015లో జరిగిన క్లరికల్ పరీక్ష ప్రశ్నపత్రాల లీక్‌పై సీఎల్పీ లీడర్ హోదాలో భట్టి విక్రమార్క 2016లో సెప్టెంబర్ 1న మీడియా సమావేశంలో, 2022 మే 19న తాడిచర్ల బొగ్గు స్కాంపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది వాస్తవం కాదా .. అని ప్రశ్నించారు. 2020 మార్చి1న జరిగిన ఈ అండ్ ఎం గ్రేడ్-2 ఎగ్జిక్యూటివ్ 2022లో జరిగిన క్లరికల్ కుంభకోణంపై కూడా విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. 2015 నుంచి సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీ నిధుల దారి మళ్లింపుపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సందెల సందీప్, తాటిపాముల హరికృష్ణ, ధనుంజయ్, విన్ను తదితరులు పాల్గొన్నారు

వనరులున్నా ఆదాయం సున్నా..

- మందుబాబులకు అడ్డాగా మున్సిపల్ కాంప్లెక్స్‌లు
- లలితా కళామందిర్ రోడ్‌లో అందుబాటులో 16 గదులు
- అసంపూర్తిగా మరో 16 గదులు
- ఆదాయం కోల్పోతున్న ఇల్లెందు మున్సిపాలిటీ



లలితా కళామందిర్ రోడ్‌లోని షాపింగ్ కాంప్లెక్స్

ఇల్లెందు: పట్టణ నడిబొడ్డున నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లు మందుబాబులకు అడ్డాగా మారాయి. ప్రారంభోత్సవం జరిగినా ఏళ్లుగా కేటాయింపు జరగలేదు. దీంతో మున్సిపాలిటీ ఆదాయం కోల్పోతోంది. అయితే మున్సిపాలిటీలో చర్చించి రిజర్వేషన్ ప్రకారం కేటాయించాల్సి ఉంది. ఇది పూర్తి కావాలంటే పలు దఫాలు టెండర్లు నిర్వహించినా ఎవరూ ఆసక్తి చూపడం లేదు. లలితా కళామందిర్ రోడ్‌లో రెండేళ్ల క్రితం సుమారు రూ.1.50 కోట్లతో కింద 16 గదులు ఒకటో అంతస్తులో మరో 16 గదుల నిర్మాణం చేపట్టారు. అతి కష్టం మీద కింది అంతస్తు నిర్మాణం పూర్తిచేశారు. పైన 16 గదులకు నిధులు లేక అసంపూర్తిగా ఉన్నాయి. ఇటీవల నిధులు కేటాయించినప్పటికీ టెండర్ ప్రక్రియ దశలోనే ఉంది. గడిచిన గత ఆగస్టు 28న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. అయితే ఈ గదులు ఇంకా ఎవరికి కేటాయించలేదు. పలు దఫాలు టెండర్లు నిర్వహించినా ఎవరూ ముందుకు రాలేదు. కేటాయింపులు జరగకపోవటం వల్ల మున్సిపాలిటీకి ఆదాయం రాకుండా పోతోంది. పలు దఫాలు వేలంపాట నిర్వహించినా ఉపయోగం లేకపోవడంతో ఆ కాంప్లెక్స్‌లు నిరుపయోగంగా ఉన్నాయి. ఎంతోమంది రోడ్డు మీద చిరువ్యాపారాలు ఈ షాపింగ్ కాంప్లెక్స్‌ల మీద ఆశలు పెంచుకున్నారు. కానీ వాటి కేటాయింపులకు ఏర్పాటు చేసినా... నిబంధనలు ఆటంకంగా మారడంతో ఎవరూ ముందుకు రావటం లేదు. తక్కువ కిరాయితో గదులు లభిస్తే చిరువ్యాపారం అభివృద్ధి చేసుకునే చాన్స్ ఉంటుంది.

పాత గదుల కేటాయింపూ జాప్యమే..

ఇదిలా ఉండగా పాత బస్టాండ్‌లో పోస్టాఫీస్‌కు ఇరు వైపులా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేశారు. ఒక వైపు ఆరు గదులు పూల దుకాణాలకు కేటాయించారు. వీటికి ఒక్కో గదికి నెలకు రూ.2 వేలు కిరాయి, మరోవైపు గదులు అసంపూర్తిగా నిర్మాణం చేసి వదిలేశారు. దీంతో అక్కడి గదులకు కిరాయి రావటం లేదు. ఇక మెయిన్ రోడ్ హైస్కూల్ ఎదురుగా 32 గదులు నిర్మించారు. సగం నిర్మాణం పూర్తి కాగా ఇటీవల ప్రారంభోత్సవం కూడా చేశారు. ఒక్కో గదికి నెలకి రూ.1500 అద్దె అని నిర్ణయించారు. ఇందులో కొన్ని గదులు ఖాళీగా ఉన్నాయి. గోవింద్ సెంటర్‌లో 10 గదులు ఉన్నాయి. వాటికి కూడా రూ.1500 కిరాయి. ఇక మెయిన్‌రోడ్ హైస్కూల్ ప్రహరీ గోడ వెంట సుమారు 20 గదుల నిర్మాణం చేయగా కోర్టు స్టేతో పనులు నిలిచిపోయాయి. అసంపూర్తిగా వదిలేశారు. అయితే వాటి ముందు కొంత మంది రోడ్డు మీద చిరువ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇటు మున్సిపాలిటీకి ఆదాయం రాకుండా ఆటు వ్యాపారాలు అభివృద్ధి చేసుకోకుండా అవుతోంది. అన్ని వనరులు ఉన్నా, ఎంత ఖర్చు చేసినా రాజకీయ ఆటంకం, అధికారులు నిర్లక్ష్యం వెరసి మున్సిపాలిటీ ఆదాయం కోల్పోతోంది.



మందుబాటిళ్లు వదిలేసి వెళ్లిన దృశ్యం

మందు బాబులకు అడ్డాగా మారాయి..



పట్టణంలోని లలితా కళామందిర్ రోడ్‌లో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ మందు బాబులకు అడ్డాగా మారింది. జగదాంబా సెంటర్‌లో మందు షాపులలో కొనుగోలు చేసి షాపింగ్ కాంప్లెక్స్ మెట్ల మీద కూర్చుని తాగుతున్నారు. బాటిళ్లు అక్కడే వదిలేసి వెళ్లిపోతున్నారు. – చాంద్‌పాషా, లలిత కళామందిర్ ఏరియా, ఇల్లెందు

పలుమార్లు టెండర్లు పిలిచాం..



మున్సిపాలిటీలోని షాపింగ్ కాంప్లెక్స్‌లకు పలుమార్లు టెండర్లు నిర్వహించినా ఎవరూ ముందుకు రాలేదు. అద్దె తగ్గించి కూడా టెండర్ పిలిచాము. అయినా విముఖత చూపుతున్నారు. మరోమారు టెండర్ ప్రక్రియ చేపడతాము. నిఘా ఏర్పాటు చేస్తాం. – దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, చైర్మన్ ఇల్లెందు మున్సిపాలిటీ

ఫాసిస్టు శక్తులను గెంటివేయాలి



మాట్లాడుతున్న రాంచంద్రన్

ఇల్లెందురూరల్: దేశంలో అసాధారణ పరిస్థితుల్లో లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయని, తిరిగి బీజేపీ అధికారంలోకి వస్తే దేశంలో ఫాసిజం వస్తుందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర నాయకుడు కేజీ రాంచంద్రన్, జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి అన్నారు. పార్టీ డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం మండలంలోని పోలారం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశం అత్యంత ప్రమాకర పరిస్థితిలో ఉందని, భారత రాజ్యాంగంలో మనకు తెలియకుండానే చెత్తబుట్టలో విసిరి వేయబడుతుందని, ప్రజాస్వామిక శక్తులు, దళితులు, మేధావులు, రాబోవు కాలంలో చెరసాలలకే పరిమితం అవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు బీజేపీ దానిని అనుసరించే శక్తులను ఓడించాలని పిలుపునిచ్చారు. దేశంలో బీజేపీని ఓడించగలిగే శక్తి ఇండియా కూటమికే ఉందని ప్రజలు ఇండియా కూటమిని గెలపించాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, చంద్ర అరుణ, నాయిని రాజు, రేసు బోసు, యాకూబ్‌షావలీ, వాంకుడోత్ అజయ్, సావిత్రి, కిరణ్, వెంకన్న, రాఘవులు, శ్రీరాంకోటయ్య, శాంతయ్య, కుమార్ పాల్గొన్నారు.

నేడు బహిరంగ వేలం

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వ ఉద్యాన నర్సరీ గరిమెళ్లపాడులో 580 మామిడి చెట్లు, 149 కొబ్బరి చెట్ల ఫలసాయానికి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు గరిమెళ్లపాడు నర్సరీలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖాధికారి కె.సూర్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రూ.3వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

మతోన్మాదులను శిక్షించండి..



మాట్లాడుతున్న ఆజాద్

ఇల్లెందు: దేశంలో కవులు, రచయితలు, ప్రజాస్వామ్యవాదులు, కమ్యూనిస్టులు, అంబేద్కర్‌వాదులు, ముస్లిం మైనార్టీలపై ఆర్ఎస్ఎస్, బీజేపీ అనుబంధ సంఘాలకు చెందిన వారు మతోన్మాద దాడులకు పాల్పడం దుర్మార్గమని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్ర వీరభద్రం, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వీ, ముస్లిం వెల్ఫేర్ కమిటీ సభ్యుడు గౌస్, నేషనల్ హ్యూమన్ రైట్స్ లీగల్ అడ్వయిజర్ శ్రీనివాస్, ప్రజాఫ్రంట్ జిల్లా నాయకుడు ఎట్టి ప్రశాంత్, పీవైఎల్ రాష్ట్ర నాయకులు మోతీలాల్, అంబేద్కర్ అధ్యయన ఐక్య వేదిక సభ్యులు మెంతెన ప్రభాకర్ అన్నారు. ఆదివారం రాత్రి ఇల్లెందు పెన్షనర్ హాల్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఏప్రిల్ 28న కాకతీయ యూనివర్సిటీలో వైస్ చాన్స్‌లర్ అనుమతితో ప్రశాంతంగా నిర్వహించుకుంటున్న సమూహ సదస్సుపై ఆర్ఎస్ఎస్ మూకలు దాడులు చేయటం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో యాకుబ్‌షావలీ, ఆర్ఎస్ బోసు, కొండలరావు, శ్రీను, రంజిత్, పార్థు, తరుణ్, శ్రావణ్ పాల్గొన్నారు.

బీజేపీ మిత్రపక్షాలను ఓడించండి..



మాట్లాడుతున్న ఊక్లా

టేకులపల్లి: సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ తరపున మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మోకాళ్ల మురళీకృష్ణ కుండ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని, దేశ ప్రజల సమస్యలను పరిష్కారాన్ని విస్మరించి హిందుత్వం మతోన్మాద చర్యలకు పాల్పడుతున్న బీజేపీ దాని మిత్రపక్షాలను ఓడించాలని న్యూడెమోక్రసీ నాయకులు బానోత్ ఊక్లా, కల్తి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మురళీకృష్ణ విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం టేకులపల్లి మండలకేంద్రంలో సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ రెండు పార్టీల మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లలో నిత్యావసరాల ధరలు అంతులేకుండా పెరిగిపోయాయని విమర్శించారు. ఈ సమావేశంలో నోముల భానుచందర్, డి.ప్రసాద్, నర్సింగ్, ధరావత్ వెంకన్న, ఎట్టి నరసింహారావు, రామచందర్, రామస్వామి, తోటకూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల ఎన్నికల కమిటీ కన్వీనర్గా భూక్యా హర్ష్య, కోకన్వీనర్గా కల్తి వెంకటేశ్వర్లును నియమించారు.

మొయినుద్దీన్ మృతి కార్మికవర్గానికి తీరని లోటు



నివాళులర్పిస్తున్న నాయకులు

పాల్వంచ: తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్142) వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ.ఖాజామొయినుద్దీన్ అకాల మృతి కార్మికవర్గానికి తీరని లోటని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రామారావు అన్నారు. ఆదివారం కేటీపీఎస్ ఎ కాలనీలోని యూనియన్ కార్యాలయంలో ఖాజా మొయినుద్దీన్ సంతాప సభ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ... హైదరాబాద్ విద్యుత్ సౌధలో ఫోర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఖాజామొయినుద్దీన్ గత నెల 29న మృతి చెందినట్లు చెప్పారు. విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ కోసం యూనియన్ స్థాపించి అహర్నిషలు పాటు పడ్డారన్నారు. ఆయన చూపిన మార్గంలో కార్మికులు నడవాలన్నారు. కార్యక్రమంలో ఎస్.దుర్గా ప్రసాద్, బొల్లేపల్లి కృష్ణమూర్తి, సత్యరాజ్ స్టీవెన్, వెంపటి వెంకటేశ్వర్లు, సయ్యద్, శివరాం, అనిల్, ప్రసాద్, వేణు, గోపయ్య, కోటేశ్వరరావు, నాగేందర్, ప్రకాశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మేడలమ్మ జాతర



గంగారం మేడలమ్మ గుట్టపై దేవతలకు పూజలు చేస్తున్న ఆదివాసీలు

టేకులపల్లి: గంగారం గ్రామంలో ప్రతీ రెండేళ్లకోసారి జరుపుకునే మేడలమ్మ జాతర వేడుకలను ఆదివాసీలు ఘనంగా జరుపుకున్నారు. కాకతీయుల కాలం నుంచి జరుపుకునే ఈ వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా ముగిసాయి. కాకతీయుల కాలం నుంచే గ్రామంలోని మేడలమ్మ గుట్టపై విగ్రహాలు లేకుండానే పూజలు జరిగేవని సుమారు ఐదేళ్ల క్రితమే గ్రామానికి చెందిన గొగ్గెల రామారావు, జయమ్మ దంపతుల కుమారుడు గొగ్గెల బాల వీరభద్రంకు కలలో మేడలమ్మ కనిపించి గుట్టపై ఉన్న సొరంగంలో విగ్రహాలు ఉన్నాయని చెప్పడంతో గ్రామస్తులు వెళ్లి చూసి నాగులమ్మ, మేడలమ్మ విగ్రహాలను బయటకు తీసి ఆనాటి నుంచి విగ్రహాలకు పూజలు చేయడం ప్రారంభించినట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

బలరాంనాయక్‌ను ఆదరించాలి..



నెహ్రూనగర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు



ఇల్లెందు: కరపత్రాలు అందజేసి ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: మహబూబాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని చల్లసముద్రం ఉమ్మడి గ్రామపంచాయతీ పరిధిలో ఆపార్టీ శ్రేణులు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు చీమల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లోనూ ప్రజలు ఆదరించాలని కోరారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి రాష్ట్ర బడ్జెట్‌ను దివాలా తీయించిన బీఆర్‌ఎస్‌ను ప్రస్తుత ఎన్నికల్లో ప్రజలు అడ్రస్ లేకుండా చేయాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఈనెల 9వ తేదీలోపు రైతుబంధు సాయం మంజూరవుతుందని, ఆగస్టు నాటికి రుణమాఫీ రూ.2లక్షలు ఒకేసారి రైతుల పేరిట బ్యాంకుల్లో జమ అవుతుందని చెప్పారు. వల్లాల రాజయ్య, ధన్‌సింగ్, భూక్యా వీరన్న, శ్రీను, పూనెం మధు, కాయం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: మహబూబాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపును కాంక్షిస్తూ పట్టణంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు డాక్టర్ జి.రవి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, ఎల్‌బీఎస్ నగర్‌లో కాంగ్రెస్ కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లారు. కాంగ్రెస్ ప్రకటించిన మేనిఫెస్టో, రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని, మోదీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్ గోపాల్, ధరావత్ కృష్ణ, తిరుమల్, అన్నం సత్యనారాయణ, గొడుగు వేణు, జితేందర్, రవి, సాయి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న వెంకటరెడ్డి

జూలూరుపాడు: జూలూరుపాడు ఎస్సీకాలనీకి చెందిన 120 బీఆర్‌ఎస్ కుటుంబాలు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరాయి. బీఆర్‌ఎస్ నాయకుడు మోదుగు రామకృష్ణ ఆ పార్టీని వీడి తన అనుచరులు, కార్యకర్తలతో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షతులమై బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రాఘురాంరెడ్డి గెలుపు కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. చేరిన వారిలో మందా నరసింహారావు, మోదుగు మణికుమార్, మందా కృష్ణయ్య, మోదుగు కమలమ్మ, ఎలుకపల్లి నరేష్, కంచపోగు నాగరాజు తదితరులు ఉన్నారు.

కార్యక్రమంలో దుద్దుకూరి మధుసూదన్‌రావు, మాలోత్ మంగీలాల్ నాయక్, నున్నా రంగారావు, యల్లంకి చిన్న నాగేశ్వరరావు, వేల్పుల నరసింహారావు, పోతురాజు నాగరాజు, లకావత్ లచ్చు నాయక్, నున్నా కృష్ణయ్య, మందా సురేష్, మిర్యాల కిరణ్ కుమార్, పాల్గొన్నారు.

పెట్టుబడిదారీ వ్యవస్థ అంటేనే దోపిడీ



కార్ల్‌మార్క్స్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం మార్క్సిజమేనని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. ఆదివారం స్థానిక మంచికంటి భవన్‌లో కార్ల్‌మార్క్స్ 206వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్ల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కనకయ్య మాట్లాడుతూ.. పెట్టుబడిదారీ సమాజంలో దోపిడీ సహజమని ఈ సమాజంలోనే నిరుద్యోగం, ఆకలి, పేదరికం విలయతాండవం చేస్తాయని, సంక్షోభాలు కూడా వస్తాయని ఈ సంక్షోభాలకు పరిష్కారం పెట్టుబడి దారీ వ్యవస్థ చూపించలేదన్నారు. విముక్తికి మార్క్స్ చెప్పిన పెట్టుబడిదారీ గ్రంథం ఉందన్నారు. ఏజే రమేష్, బాలరాజు, కొండపల్లి శ్రీధర్, భూక్యా రమేష్, డి.వీరన్న, నందిపాటి రమేష్, కే.సమ్మయ్య పాల్గొన్నారు.

మోకాళ్లపై మెట్లెక్కి శ్రీరాముడి దర్శనం



మెట్లు ఎక్కుతున్న రాంసింగ్

జూలూరుపాడు: కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి గెలుపును ఆకాంక్షిస్తూ, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభిమాని బర్మావత్ రాంసింగ్ మోకాళ్లపై మెట్లు ఎక్కి భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారిని ఆదివారం దర్శించుకున్నాడు. కరివారిగూడెం పంచాయతీ తవిసిగుట్ట తండాకు చెందిన రాంసింగ్ మోకాళ్లపై 105 మెట్లు ఎక్కి రఘురాంరెడ్డి విజయం సాధించాలని స్వామిని వేడుకున్నాడు. ఈ విషయాన్ని ఆదివారం రాంసింగ్ స్థానిక విలేకరులకు తెలిపాడు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరు ఎమ్మెల్యేగా గెలిచాక తిరుమల వెళ్లినట్లు చెప్పాడు.

యువత భవిష్యత్‌పై దృష్టి పెట్టాలి



చర్చిలో ప్రార్థన చేస్తున్న యువత

ఇల్లెందురూరల్: మండలంలోని మామిడిగూడెం సీఎస్ఐ గ్రూపు పాలు దేవాలయంలో ఆదివారం యవ్వనస్థుల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని యువత చర్చికి చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్ట్రేట్ చైర్మన్ డేవిడ్‌రాజు, ముఖ్యఅతిథి ఎస్.సుధాకర్ మాట్లాడుతూ.. చదువు, ఉజ్వల భవిష్యత్‌పై దృష్టి పెట్టాల్సిన సమయంలో యువత చెడు వ్యసనాలకు బానిసలై భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నట్లు చెప్పారు. పలు ఉదాహరణలతో వివరించి యువతలో చైతన్యం కలిగించారు. కరుణామయుడైన ఏసుక్రీస్తు ద్వారా యుక్త వయస్సులో జీవించాల్సిన మార్గాలను బోధించారు. ఏసుక్రీస్తు చూపిన మార్గంలో పయనించి ఉజ్వల భవిష్యత్‌ను పొందాలని సూచించారు. కార్యక్రమంలో దయానంద్, జాషువా, సతీష్, సుధీర్ పాల్గొన్నారు.

అకాలవర్షంతో అతలాకుతలం

- విరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- గాలికి ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు
- నెహ్రూనగర్‌లో ధ్వంసమైన పెంకు ఫ్యాక్టరీ

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలలతో కూడిన భారీ వడగండ్ల వాన కురిసింది. చల్లసముద్రం పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారిపై భారీ వృక్షాలు నేలవాలగా, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో ఇల్లెందు నుంచి మహబూబాబాద్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. నెహ్రూనగర్ గ్రామంలోని రామకృష్ణ క్లే ప్రొడక్ట్స్ పెంకుల పరిశ్రమకు చెందిన మూడు భారీ నిర్మాణాల పైభాగం ఈదురు గాలలకు లేచిపోయింది. కూలీలు నివాసం ఉండే ఇళ్లపై కూడా పైకప్పులు ఎగిరిపోయాయి. పరిశ్రమ యజమానికి రూ.50 లక్షల వరకు నష్టం వాటిల్లిందని స్థానికులు తెలిపారు. ఈదురుగాలులకు చల్లసముద్రం గ్రామంలో చెట్లు భారీ సంఖ్యలో విరిగిపడ్డాయి. దీంతో కొన్ని ఇళ్లకు నష్టం వాటిల్లగా ఒక ట్రాక్టర్ ధ్వంసమైంది. మామిడిగుండాల గ్రామంలో రేకుల ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. మామిడి కాయలు నేలపాలవ్వగా.. ధాన్యం, మొక్కజొన్న నీటిలో తడిసి ముద్దయ్యాయి.







నెహ్రూనగర్‌లో లేచిపోయిన పెంకు పరిశ్రమ పైకప్పు, క్యాంపు సెంటర్‌లో ట్రాక్టర్‌పై విరిగిపడిన చెట్టు, చల్లసముద్రంలో రోడ్డుపై విరిగిపడిన చెట్టు